# సాక్షి పెద్దపల్లి

గురువారం । 11 । మే । 2023




## కంటి వెలుగు శిబిరం ప్రారంభం

జ్యోతినగర్(రామగుండం): కృష్ణానగర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని రామగుండం మేయర్ అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు బుధవారం ప్రారంభించారు.



## ప్రతిష్ఠాపనోత్సవాలు షురూ..

పెద్దపల్లిరూరల్: రాగినేడులోని శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ఘనంగా మొదలయ్యాయి.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/27.0

## వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వేగంగా గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### ఇంటర్ టాపర్లకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను కలెక్టర్ సంగీత అభినందించారు. పెద్దపల్లి, రామగుండం, మంథనిలోని మైనార్టీ గురుకుల కళాశాలల విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు కష్టపడి చదవాలని కలెక్టర్ సూచించారు. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేలా చూడాలని ఆదేశించారు. జిల్లా మైనార్టీ అధికారి మెహరాజ్ మహమ్మద్, ప్రిన్సిపాల్స్ సుజాత, మీర్జా సిరాజ్‌బేగ్, అస్మాజబీన్ ఉన్నారు.

### 17న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

పెద్దపల్లిరూరల్/జ్యోతినగర్(రామగుండం): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 17న పెద్దపల్లిలోని జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నామని జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. 3, 5, 6 స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం జరిగే 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

**18న సర్వసభ్యసమావేశం**

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18న రామగుండం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో ఏర్పాటు చేసినట్లు జెడ్పీ సీఈవో శ్రీనివాస్ తెలిపారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

# 'పది'లో మెరిశారు

**పదోతరగతి ఫలితాల్లో బాలికలదే హవా**

- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 92.49 శాతం ఉత్తీర్ణతతో 9వ స్థానంలో జిల్లా
- గతేడాది కంటే తగ్గిన ఉత్తీర్ణత శాతం



పది జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు రమ్యశ్రీ, మహాలక్ష్మీ, అభినయశ్రీ, మాధవ్, హ్రిషికేశ్, రేవన్‌కుమార్

సాక్షి, పెద్దపల్లి: పదోతరగతి ఫలితాల్లో గతంలో మాదిరిగానే బాలికల హవా కొనసాగింది. మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాలతో జిల్లా చివరిస్థానంలో నిలవగా.. బుధవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాలతో 9వ స్థానం సాధించింది. గతేడాది కంటే ఈసారి ఉత్తీర్ణత శాతం తగ్గినప్పటికీ జిల్లా స్థానం మెరుగుపడింది. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. 2019–20, 2020–21 వరుస విద్యాసంవత్సరాలలో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండానే అందరినీ ఉత్తీర్ణులుగా ప్రకటించారు. ఈ సంవత్సరం జిల్లావ్యాప్తంగా 47 కేంద్రాల్లో 7,937 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 92.49 శాతంతో 7,332 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 4,016 మందికి 3,683 మంది ఉత్తీర్ణులై 91.71 శాతం, బాలికలు 3,911 మందికి 3,649 మంది ఉత్తీర్ణులై 93.3 శాతం నమోదైంది. గతేడాది 94.07 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో జిల్లా 12వ స్థానంలో నిలువగా, ఈయేడాది ఉత్తీర్ణత శాతం తగ్గిన 9వ స్థానంలో నిలవడం గమనార్హం.

**ప్రభుత్వ పాఠశాలల్లో 15 మందికి 10 జీపీఏ**

పెద్దపల్లి జిల్లాలో 134 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీరిలో 4,810 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఇందులో 4,369 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లావ్యాప్తంగా 73 మంది 10కి 10 జీపీఏ సాధించగా.. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 15 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 49 మంది బాలికలుండగా, 24 మంది బాలురు ఉన్నారు. 58 మంది ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. వీరిలోనూ 39 మంది బాలికలు ఉంటే, 19 మంది బాలురు ఉన్నారు. 134 ప్రభుత్వ పాఠశాలల్లో 37 పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో 33 జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, నాలుగు కేజీబీవీలు ఉన్నాయి.

**జూన్ 14నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు**

మార్కులు రీవెరిఫికేషన్ చేయాలనుకునే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.వెయ్యితో హాల్‌టికెట్‌తో ప్రధానోపాధ్యాయుని సంతకంతో కూడిన దరఖాస్తును డీఈవో కార్యాలయంలో సమర్పించాలి. మార్కులు రీకౌంటింగ్ చేయాలనుకునే విద్యార్థులు రూ.500 ఫీజుతో 15 రోజుల్లోగా చలానా తీసి దరఖాస్తు చేసుకోవచ్చు. ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల కోసం ఈనెల 26వ తేదీలోపు ఫీజు చెల్లించాలని విద్యాశాఖ తెలియజేసింది. వారికి సంబంధించిన అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 14 నుంచి 22 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ పేర్కొంది.

## సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు

- 37 స్కూళ్లలో వందశాతం ఫలితాలు

పెద్దపల్లిరూరల్: పదోతరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు సత్తాచాటాయి. వందశాతం ఫలితాలు సాధించాయి. పెద్దపల్లి మండలంలోని రాఘువాపూర్, కొత్తపల్లి, నిట్టూరు, రాగినేడు, మారెడుగొండ, రంగాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులు అయ్యారు.

**మంథని:** మంథని మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్‌పల్లి మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ వంద శాతం ఫలితాలు సాధించింది.

**కమాన్‌పూర్(మంథని):** మండలంలోని పన్నూర్ కేజీబీవీ(బాలికల)తోపాటు కల్వచర్ల, నాగేపల్లి, రామయ్యపల్లి పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. పన్నూర్‌లోని కేజీబీవీ విద్యార్థిని మండలంలోని రొంపికుంటకు చెందిన రమ్యశ్రీ 10 జీపీఏ సాధించి టాపర్‌గా నిలిచింది. విద్యార్థులను రామగిరి వైస్‌ఎంపీపీ కాపురబోయిన శ్రీదేవి అభినందించారు.

**సుల్తానాబాద్‌రూరల్:** సుల్తానాబాద్ మండలంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకులం, నారాయణపూర్ జెడ్పీ హైస్కూల్, రేగడిమద్దికుంట ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. గర్రెపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థినులు మహాలక్ష్మీ, అభినయశ్రీ, మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకులం విద్యార్థులు మాధవ్, హ్రిషికేశ్ 10 జీపీఏ సాధించారు.

**కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి):** మండలంలో ఎనిమిది జెడ్పీ హైస్కూళ్లు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. గంగారం, మొట్లపల్లి, మీర్జంపేట, పందిల్ల, పెగడపల్లి, తారుపల్లి, వెన్నంపల్లి, కేజీబీవీ ప్రభుత్వ హైస్కూళ్లలోని విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు.

**పాలకుర్తి(రామగుండం):** పాలకుర్తి మండల కేంద్రంతోపాటు ముంజంపల్లి పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈసాలతక్కళ్లపల్లి పాఠశాల 50 శాతం ఉత్తీర్ణతతో మండలంలో చివరి స్థానంలో నిలిచింది.

**ధర్మారం:** మండలంలోని నందిమేడారం టీఎస్‌ఆర్ జేఎస్ విద్యాలయం విద్యార్థి బి.రేవన్‌కుమార్ 10జీపీఏ సాధించాడు. మండలంలోని కొత్తూరు, మల్లాపూర్, పెర్కపల్లి ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

## ప్రశాంతంగా ఎంసెట్



కమాన్‌పూర్(మంథని): రామగిరి మండలం మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఎంసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజు అగ్రి, ఫార్మసీకి చెందిన రెండు సెషన్స్‌లలో పరీక్ష నిర్వహించగా మొదటి సెషన్స్‌లో 99 మంది విద్యార్థులకు 89 మంది, రెండు సెషన్స్‌లో 99 మంది విద్యార్థులకు 90 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బి.విష్ణువర్ధన్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద రామగిరి ఎస్సై రవిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మల్లన్నకు మొక్కులు చెల్లింపు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు బుధవారం భారీగా భక్తులు తరలివచ్చారు. కోడె మొక్కులు, పట్నం, బోనం మొక్కులు చెల్లించుకున్నారు. గండ దీపం వెలిగించి ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి పరిశీలించారు.

## క్లుప్తంగా

### సీపీకి మంత్రి కేటీఆర్ అభినందనలు




గోదావరిఖని(రామగుండం): దేశంలోనే అత్యుత్తమైన రూరల్ పోలీస్ కమిషనరేట్ భవనాన్ని ప్రారంభించినందుకు రాష్ట్ర మంత్రి కేటీఆర్ ట్విట్టర్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరీకి అభినందనలు తెలిపారు. దీనికి ప్రతిగా స్పందించిన సీపీ మీరు ప్రారంభించిన అత్యాధునిక భవనంలో విధులు నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

### న్యూడెమోక్రసీ పార్టీకి సర్పంచ్ గుడ్‌బై


మాట్లాడుతున్న సర్పంచ్ భాగ్యమ్మ

రామగుండం: న్యూడెమోక్రసీకి చెందిన ఏకైక సర్పంచ్ ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట సర్పంచ్ మేర్గు భాగ్యమ్మ న్యూడెమోక్రసీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు బుధవారం ప్రకటించారు. మండలకేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలలుగా సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. వీటన్నింటికి మనస్థాపం చెంది పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఇక నుంచి న్యూడెమోక్రసీ, ప్రజాపంథా పార్టీలతో ఎలాంటి సంబంధం లేదని సీనియర్ నాయకుడు, సర్పంచ్ భర్త మేర్గు గురువయ్య స్పష్టం చేశారు.

### డీసీపీని కలిసిన వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు



సుల్తానాబాద్: వరంగల్ డీసీపీగా ఎం.ఏ.బారీ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.రవీందర్ బుధవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, అభినందించారు. వరంగల్‌లో జాతీయ వాలీబాల్ అసోసియేషన్ సభ్యుడిని కావడంతో డీసీపీని కలిసినట్లు రవీందర్ తెలిపారు.

### రెండు ధాన్యం లోడు వాహనాలు ఢీ..

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం బొంతకుంటపల్లి సమీపంలోని రాజీవ్ రాహదారిపై వరి ధాన్యం లోడుతో వెళ్తున్న రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఎస్సై వినిత తెలిపిన వివరాలు. వరి ధాన్యంతో ఉన్న ట్రాక్టర్ నందిని వేబ్రిడ్జి నుంచి బయటకు వస్తుండగా కరీంనగర్ వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడగా ధాన్యం బస్తాలు రోడ్డుపై పడ్డాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

రామగుండం: పట్టణంలోని ఎన్టీపీసీ కాలనీకి చెందిన గొల్లమందుల ఆంజనేయులు(52) బుధవారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపిన వివరాలు. వరంగల్ జిల్లా బావుపేటకు చెందిన గొల్లమందుల ఆంజనేయులు భార్య కుటుంబ కలహాలతో విడిచిపెట్టింది. ఈ నేపథ్యంలో ఆంజనేయులు పట్టణంలోని ఎన్టీపీసీ కాలనీలోని తన అమ్మమ్మ ఇంట్లో ఉంటూ కూలీ పని చేసుకుంటున్నాడు. కాగా కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలు, మానసిక స్థితి సరిగ్గా లేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయం తలనొప్పిగా ఉందని బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబసభ్యులు తెలిపారు. స్థానిక వంతెన కింద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఔట్‌పోస్టు ఇన్‌చార్జి తిరుపతి తెలిపారు.

### ఈదురుగాలి బీభత్సం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం వీచిన ఈదురుగాలికి అనుముల కుమార్‌కు చెందిన రేకులషెడ్డు పైకప్పు కొట్టుకుపోయింది. ఇప్పలపల్లిలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు విరిగిపోయాయి. విద్యుత్ సిబ్బంది జంపర్లు కట్‌చేసి విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు.

# తునికాకు సేకరణ.. ఫలితం దక్కేనా?

- అందుబాటులో లేని ఆకు
- దూర ప్రాంత అడవుల నుంచి తీసుకొస్తున్న వైనం
- ఇంటిల్లిపాదికి ఇదే ఉపాధి
- ధర పెరిగితేనే కష్టానికి ఫలితమంటున్న గుండారంవాసులు


ఎండలో ఆరబెట్టిన తునికాకు కట్టలు


ఇంటి వద్ద తునికాకును కట్టలు కడుతున్న ఓ కుటుంబం

కమాన్‌పూర్(మంథని): కొన్నేళ్ల క్రితం మారుమూల అటవీ గ్రామాలతోపాటు గుట్టలకు సమీపంలోని పల్లెల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో తునికాకు(బీడీ ఆకు) కల్లాలు కనిపించేవి. ఆకు సేకరణకు నెల రోజుల ముందు తునికి చెట్లను అటవీ శాఖ ఆధ్వర్యంలో కొట్టించేవారు. ప్రతీ రోజు తెల్లవారుజామున ప్రజలు తునికాకు తీసుకొని ఇంటికి వచ్చేవారు. తర్వాత ఇంటిల్లిపాది దాన్ని కట్టలు కట్టేవారు. వాటిని సాయంత్రం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసే కల్లాల వద్దకు తీసుకెళ్లి, విక్రయించేవారు. వారం రోజులకు అటవీ శాఖ వారు ఇచ్చే డబ్బులతో కుటుంబాలను పోషించుకునేవారు. కాలక్రమేన తునికాకు కల్లాల నిర్వహణ కనుమరుగైపోయింది.

**బీడీ కంపెనీలకు విక్రయం**

కమాన్‌పూర్ మండలంలోని గుండారం గ్రామానికి చెందిన పలు కుటుంబాలు రెండేళ్లుగా తునికాకు సేకరణతో ఉపాధి పొందుతున్నాయి. వీరు అటవీ ప్రాంతానికి వెళ్లి తునికాకు సేకరించి, ఎండలో ఆరబెట్టి బీడీ కంపెనీలకు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు.

**ఆకు కోసం దూర ప్రాంతాలకు పయనం**

కమాన్‌పూర్ మండల పరిధిలో కొన్ని రోజులుగా తునికాకు లభ్యత లేకపోవడంతో ఇక్కడి ప్రజలు దూర ప్రాంతాలకు పయనమవుతున్నారు. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ముత్తారం మండలాల పరిధిలోని అడవికి వెళ్లి, ఆకు తెస్తున్నారు.

**గతేడాది క్వింటాల్‌కు రూ.8 వేలు**

గతేడాది సేకరించిన ఆకును నిజామాబాద్‌కు చెందిన బీడీ కంపెనీల వారు రూ.8 వేలకు క్వింటాల్ కొనుగోలు చేసినట్లు పలువురు పేర్కొన్నారు. ప్రస్తుతం మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఈ ఏడాది ఆకు ధర గతం కంటే ఎక్కువ ఉంటేనే తాము పడిన కష్టానికి ఫలితం ఉంటుందని వారు అంటున్నారు.

### బైక్‌పై వెళ్లి తెస్తున్నం



మా ఊరికి దగ్గరలో ఉన్న గుట్టకు అందరికీ సరిపడా తునికాకు లేదు. దీంతో గుట్ట అవతలి వైపునకు బైక్‌పై వెళ్లి, ఆకు సేకరించుకువస్తున్నాం. గత వారం రోజులుగా ఆకు తెచ్చి, కట్టలు కట్టి, ఎండలో ఆరబెడుతున్నాం.

– గరిగంటి సదయ్య, గుండారం

### ఎక్కువ ధర చెల్లించాలి



ఇంట్లో ఉన్నవాళ్లం దరం తెల్లవారు జామునే గుట్టకు పోయి తునికాకు తెంపుకొని వస్తున్నం. గతేడాది క్వింటాల్ ఆకును రూ.8 వేలతో కొనుగోలు చేశారు. గతం కన్నా ధర ఎక్కువ చెల్లిస్తేనే మా కష్టానికి ఫలితం దక్కుతుంది.

– నంది లక్ష్మి, గుండారం

### సీఎం కేసీఆర్‌ది నిజాం పాలన

- టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేశ్‌గౌడ్


జేపీఎస్‌ల దీక్షకు మద్దతుగా సంతకం చేస్తున్న రమేశ్‌గౌడ్

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిజాం తరహా పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రమేశ్ గౌడ్ ఆరోపించారు. పెద్దపల్లిలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల దీక్షా శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి, వారికి సంఘీభావం తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు పల్లెల్లో పని చేస్తేనే రాష్ట్రానికి అవార్డులు దక్కాయన్న విషయాన్ని పాలకులు మరచిపోయారని అన్నారు. ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరిన వారిపై బెదిరింపులకు దిగడం తగదన్నారు. జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, ప్రశాంత్, రాహుల్ తదితరులున్నారు. అలాగే కొలువుల కోసం కొట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శులకు ఐఎఫ్‌టీయూ, ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, రమేశ్, వెంకన్న తదితరులు మద్దతు ప్రకటించారు. ప్రభుత్వ వైఖరి చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

# సింగరేణి కార్మికులు 25 వేల మంది తగ్గారు

- సీఎం కేసీఆర్ హామీలు అమలు కాలేదు
- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణిలో 25 వేల మంది కార్మికులు తగ్గారని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జీడీకే–2వ గనిపై నిరాహార దీక్ష చేపట్టారు. అంతకుముందు నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాకముందు సింగరేణిలో 68 వేల మంది కార్మికులు ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య 43 వేలకు తగ్గిందన్నారు. ఏటా కార్మికుల సంఖ్య తగ్గుతుండగా ఉత్పత్తి మాత్రం భారీగా పెంచుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. కార్మికులకు మెరుగైన అలవెన్స్ వచ్చేలా వేజ్‌బోర్డులో పోరాటం చేస్తామన్నారు. మంత్రి కేటీఆర్ కార్మికుల కోసం ఒక్కమాట మాట్లాడిన పాపానపోలేదని, గతంలో సీఎం కేసీఆర్ సింగరేణి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని ఆరోపించారు. కార్మిక కుటుంబాలకు సురక్షితమైన తాగునీరందించడంలో యాజమాన్యం విఫలమైందని మండిపడ్డారు. అనంతరం టూఇంక్లయిన్ బ్రిడ్జి విస్తరించాలని, బదిలీ వర్కర్ల ప్రమోషన్లు, సర్ఫేస్ నియామకాలు, మహిళా ఉద్యోగులకు ఫీడింగ్ రూంలు, అన్ని గనుల్లో లాకర్ల సదుపాయం, కొత్త మరుగుదొడ్లు నిర్మించాలని కోరుతూ ఒక్క రోజు నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సదానందం, ధర్మపురి, వికాస్‌కుమార్ యాదవ్, ఎట్టం కృష్ణ, బత్తుల పోచయ్య, అల్లావుద్దీన్, మనోహర్, ఆంజనేయులు, పోలు మహేశ్ బాబు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో 'తేజస్' సత్తా


విజయ సంకేతం చూపుతున్న యాజమాన్యం, విద్యార్థులు

కరీంనగర్: ఇంటర్ ఫలితాల్లో తేజస్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని కళాశాల యాజమాన్యం సీహెచ్.సతీశ్‌రావు బుధవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కె.యశ్వంత్ 465, యు.హర్షిత్ 464, టి.గణేశ్ 463, ఎం.రమేశ్‌కుమార్ 461 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో సీహెచ్.సూర్య 984, ఎస్.శ్రావణ్‌రెడ్డి 981, సీఈసీలో ఎ.అక్షయ్ 973 మార్కులు సాధించారని పేర్కొన్నారు.

### 'అల్ఫోర్స్' విద్యార్థుల హవా



సుల్తానాబాద్(పెద్దపల్లి): పదో తరగతి ఫలితాలలో సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించి ముందంజలో నిలిచారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తెలిపారు. 10 జీపీఏ సాధించిన వారిలో అక్షయ్‌కుమార్, వివేక్‌వర్ధన్, ఎ.మనోజ్ఞ, వర్షితరెడ్డి, జి.అక్షయ్ ఉన్నారని వివరించారు. పాఠశాల నుంచి 78 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 9.8 జీపీఏ ఆరుగురు, 9.7 జీపీఏ పది మంది, 9.5 జీపీఏ పది మంది, 9.3 జీపీఏ ఎనిమిది మంది, 9.2 జీపీఏ 12 మంది, 9 జీపీఏ నలుగురు విద్యార్థులు సాధించారని తెలిపారు. అల్ఫోర్స్‌లో అత్యున్నతమైన విద్యాబోధన అందిండంతోనే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు.

# 'పది' ఫలితాల్లో 'మానేరు' విజయఢంకా


అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులు విజయఢంకా మోగించినట్లు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి తెలిపారు. 9 మంది సనా ఫర్హత్, సహస్ర, శిరీష, చరిష్మా, స్ఫూర్తి, స్నిగ్ధ, హన్సిక, అద్నాన్, దర్శిల్‌లు 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, ఏడుగురు 9.7 జీపీఏ, ఆరుగురు 9.5 జీపీఏ, 54 మంది 9.0 ఆపై జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడారు. మానేరు విద్యాసంస్థల విద్యార్థులందరూ ఉత్తీర్ణులైనట్లు చెప్పారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డితోపాటు డైరెక్టర్లు కడారి సునీతారెడ్డి, కృష్ణారెడ్డి, శ్వేతారెడ్డి, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

# 'పారమిత' విద్యార్థుల విజయకేతనం


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కరీంనగర్: పదోతరగతి ఫలితాల్లో పారమిత పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. 11 మంది 10 జీపీఏ, 20 మంది 9.8 జీపీఏ, 38 శాతం మంది 9.5 ఆపైన జీపీఏ, 65 శాతం విద్యార్థులు 9.0 ఆపైన జీపీఏ, 91 శాతం మంది 8.0 ఆపైన జీపీఏ సాధించారు. విద్యార్థులను పారమిత పాఠశాలల అధినేత ఇ.ప్రసాదరావు అభినందించారు. తమ విద్యాసంస్థల్లో నైపుణ్యాలకు పెద్దపీట వేసి, ప్రస్తుత పోటీ ప్రపంచాన్ని తట్టుకునేలా పిల్లలను అన్నిరంగాల్లో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. డైరెక్టర్లు ప్రసూన, అనుకర్‌రావు, రష్మిత ప్రసాద్, రాకేశ్, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, ఎస్‌వోడీ తిరుపతిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తుండ్రు

- తూకం వేసిన వెంటనే రశీదు ఎందుకియ్యరు?
- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు
- రాజీవ్ రహదారిపై రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రకృతి ప్రకోపానికి ఆగమైన రైతులను ఆదుకోవాల్సిన పాలకులు.. మిల్లర్లతో కుమ్మక్కై, తూకంలో మోసాలకు పాల్పడుతున్నారని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు మండిపడ్డారు. పెద్దపల్లిలోని చీకురాయి రోడ్‌నుంచి కమాన్ వరకు పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్రగా వచ్చి రాజీవ్ రహదారిపై బైఠాయించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు రోజుల తరబడి నిరీక్షిస్తున్నారన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయిందని, కనీసం టార్పాలిన్లను అందించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. తూకం వేసిన వెంటనే రశీదు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కటింగ్ పేరిట మిల్లర్లు, తాలు పేరిట కొనుగోలు కేంద్రాల్లో అధిక తూకం వేస్తూ దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సురేశ్‌గౌడ్, అన్నయ్యగౌడ్, సారయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, మల్లయ్య, శ్రీనివాస్, సతీశ్, సంపత్, అక్బర్‌అలీ, మస్రత్, నెత్తెట్ల కుమార్, సుభాష్, శ్రీమాన్, అంజయ్య, సత్యం, రాజయ్య, రాములు, బండ శ్రీను, మధు, ఖాజా, పోచాలు, సంతోష్, సర్వర్‌పాషా ఉన్నారు.

# 'నేతన్న' డాక్యుమెంటరీ విడుదల


డాక్యుమెంటరీ విడుదల చేస్తున్న చైర్మన్ ప్రవీణ్

కరీంనగర్ కల్చరల్: ఒకప్పుడు నేత కార్మికుల ఆత్మహత్యలకు నిలయమైన సిరిసిల్ల ఇప్పుడు ఆ సామాజికవర్గానికి నిజమైన సిరిసంపదల ఖిల్లాగా మారింది. దీన్ని వివరించే జై మార్కండేయ బ్యానర్‌పై రూపొందించిన 'నేతన్న' డాక్యుమెంటరీని బుధవారం హైదరాబాద్ నారాయణగూడలోని టెస్కో భవన్‌లో తెలంగాణ పవర్‌లూం, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మంత్రి కేటీఆర్ కృషితో సిరిసిల్ల నేతన్నల జీవితాల్లో వెలుగులు ప్రసరించిన తీరుపై పద్మశాలీ మహిళ గోనె స్వర్ణ అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ డాక్యుమెంటరీ తీశారని తెలిపారు. ఇది వాస్తవాలకు అద్దం పట్టిందన్నారు. కార్యక్రమంలో డాక్యుమెంటరీ సమర్పకుడు గోనె రాజేంద్రప్రసాద్, దర్శకుడు అయిలు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరినదిలో దూకి యువకుడి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): రామగుండంలోని చైతన్యపురికాలనీకి చెందిన గాజుల ప్రశాంత్(29) బుధవారం గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు. పేయింటింగ్ పనులు చేసే ప్రశాంత్‌కు భార్య, ముగ్గురు పిల్లలు. అప్పులు ఎక్కువ కావడంతో వాటిని తీర్చేందుకు ఇటీవల ఆటో కొనుగోలు చేశాడు. దీంతో అప్పులు మరింత పెరగడంతో ఆటోను అమ్మి పేయింటింగ్ పనులకు వెళ్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 8న తన భార్యకు ఫోన్ చేసి గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వంతెన వద్దకు వచ్చి చూడగా బైక్ మాత్రమే కనిపించింది. ఎన్టీపీసీ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం గోదావరినదిలో జనగామ ఇటుక బట్టీల సమీపంలో ప్రశాంత్ మృతదేహం లభించింది. తన భర్త అప్పుల బాధ భరించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని భార్య సుమలత ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మాజీ ఎంపీ వివేక్


ధాన్యం పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వివేక్

మంథని: అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ డిమాండ్ చేశారు. మంథని మండలం నాగేపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించి, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. తేమశాతం లేదనే సాకుతో ధాన్యం తూకం వేయడం లేదని, కేంద్రాల్లో ధాన్యం ఉంటే వర్షానికి మళ్లీ తడిసే ప్రమాదం ఉందన్నారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకునే కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమాను రాష్ట్రంలో అమలు చేస్తే ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు రైతులకు ఎంతగానో ఉపయోగపడేదన్నారు. చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, నాంపల్లి రమేశ్, చిలువేరు సతీశ్, తోట మధుకర్, బీమరావు సంపత్, సాదుల శ్రీనివాస్, కాసిపేట మల్లేశ్, రేపాక శంకర్, ఎడ్ల సదాశివ్ ఉన్నారు.

### మిస్సింగ్ కేసు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ చైతన్యపురికాలనీకి చెందిన పస్తం సురేశ్ (27) ఇంటి నుంచి బయటకు వెళ్లి నాలుగు నెలలు గడిచిన ఇప్పటి వరకు తిరిగి రాలేదని భార్య పస్తం అనూష ఫిర్యాదు చేశారు. ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

### డీఎంఎస్‌కు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్న ఎస్‌వోటూ జీఎం రఘుపతి, అధికారులు

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇనుముల సత్యనారాయణ డైరెక్టర్ మైన్స్ సేఫ్టీ(డీఎంఎస్)గా పదోన్నతి పొందగా రామగిరి అతిథి గృహంలో బుధవారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్జీ–3 ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సింగరేణి అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు దిడ్డి చంద్రమౌళి, ఆర్జీ–3 సీఎంవోఏ అధికారుల సంఘం అధ్యక్షుడు మత్స్యగిరి నరేందర్ లు తదితరులు పాల్గొన్నారు.